# కంఠంనేని రాధాకృష్ణమూర్తి



## దౌష్ట్యం

**లోకంలో కొందరు అవసరార్థం దుర్మార్గాలు చేస్తే కొందరు స్వభావరీత్యానూ మరికొందరు తమ గొప్పని కాపాడుకోవటం కోసమూ దుర్మార్గాలు చేస్తుంటారు. ఇప్పుడు చెప్పబోయేది ఈ మూడో బాపతుకు చెందినది.**

కమల కలవాళ్ళ అమ్మాయి. ఒక అమ్మాయికి గాని, అబ్బాయికి గానీ వ్యక్తిత్వం రూపు దిద్దుకోవటానికి తల్లిదండ్రుల పెంపకం - ముఖ్యంగా తల్లి శిక్షణ ఎంతో దోహదం చేస్తుంది. వాళ్ళు మంచిగా పెంచారంటే పిల్లలు పెద్దయాక సమాజానుకూలంగా చక్కటి సంస్కారంతో విలసిల్లుతారు. గాలికి వదిలేయటమో లేక పిచ్చి గారాబంతో అడ్డూ అపూ లేకుండా పెంచటమో చేస్తే కమలలాగా తయారవుతారు.

కమల చిన్నప్పటి నుంచీ శరీరంలో వగరునూ, మనసులో పొగరునూ నింపుకుంటూ చాలా అగ్రెసివ్ స్వభావంతో పెరిగింది. తినే తిండి వల్లా చేసుకునే పోషణ వల్లా స్వతహా వున్న ఆరోగ్యం ద్వారానూ ఆమె వయస్సు కంటే ముందుగా శరీరం ఏపుదేలి అపరిపక్వ దశలోనే బుసబుసా, భుగభుగా ఆవిరులు కక్కసాగింది. రక్తాన్ని ప్రతిఫలిస్తూ మిసమిసా మెరిసిపోయే ఆమె పసిడి దేహాన్ని చూస్తే నరమాంస భక్షుడికి నోట్లోకి లాలాజలమూ నపుంసక ముండాకొడుక్కి నరాలలోకి చలనమూ జలజలా చరచరా ఉరుక్కుంటూ వస్తాయి. ప్రపంచం మొత్తంలోనే ఆరోగ్యంతో తళతళా మెరిసిపోయే అమ్మాయి ఎవరన్న విషయంమీద పరీక్షకు నిలిపితే కమల అందరిలోకి ఉన్నత శ్రేణిలో వస్తుంది.

అమ్మాయి దశనుంచి కమల మిసమిసా మెరిసిపోయే యవ్వన దశలోకి అడుగుపెట్టేనాటికి ఆమె యవ్వనం ఆమె ఆరోగ్యాలే ఆమెకు శత్రువులుగా ప్రతిబంధకాలుగా తయారయ్యాయి. శరీరం ఎప్పుడూ తీయగా మూలుగుతుండేది ఆమెకు. సంస్కారమంటూ ఎటూ అలవడలేదుకాబట్టి మనస్సులో ఆలోచనలు ఎప్పుడూ కళ్ళెం తెగిన గుర్రంలా పరుగిడుతుండేవి. వైల్డ్‌గా విలాసంగా పచ్చిగా పొగరుగా యవ్వనం తాలూకు విద్యుదలలు సదా దేహంలో అటూ ఇటూ పరుగులు తీస్తూ కలవరపెడుతుండేవామెను పచ్చికబయళ్ళమధ్య చీకటి గయ్యాలాలూ, ఆకాశాన్నుంచి జాలువారే జలపాతాలూ, ఆటుపోట్లతో పొంగిపొరలే సముద్రరవాలూ, గోమటేశ్వరుని నగ్నత్వమూ, ఖజురహో శృంగార భంగిమలూ నిత్యం ఆమెమదిలో దేహంలో నర్తిస్తుంటాయి ఒకోసారి ఆ తీవ్రతను తట్టుకోలేక ఆమె నౌఖరో చాకరో, కుక్కగాడిదో అయినా పరవాలేదనుకునేది. అలాంటి బలహీన క్షణాలలో ఎప్పుడో ఆమె కాలుజారింది. గర్భవతి అయింది... ఆమె గర్భ

వతి అయిందన్న సంగతి ఆమె తల్లిదండ్రులకు తెలుసో లేదోగాని ఆమె బురదలో అడుగేస్తోందని తెలిసీ తెలియగానే ఆ బురద తమ పరువు ప్రతిష్టమీదా, గొప్పతనాలమీదా చిందకముందే తమకున్న డబ్బు, దాబును అడ్డంపెట్టుకుని ఓ విద్యాధికుణ్ణి కొనుక్కొచ్చి ఆమెకు అంటగట్టారు!

ఆ విద్యాధికుడి పేరు విద్యాసాగర్. విద్యాసాగర్ మధ్య తరగతి కుటుంబాన్నుంచి వచ్చాడు. చిన్నప్పటినుంచి చక్కగా చదువుకుని బుద్ధిమంతుడుగా పేరొందుతూ పైకి వచ్చాడు. మధ్య తరగతి వాళ్ళ అందరికీ ఉన్నట్లే అతనికీ కుహనా నీతి నియమాల మీదా, పనికిమాలిన సాంప్రదాయాల పట్లా మంచి పట్టింపు వుంది. స్వయానా అతను వాటిని తన జీవితంలో ఆచరించాడు. సహజంగానే ఇతరుల్నించి ఆశిస్తున్నాడు.

తన భార్యగా లభించిన కమలను చూసి విద్యాసాగర్ మొదట్లో ఎంతో మురిసిపోయాడు. తనంతటి అదృష్టవంతుడు మరొకడు లేడనుకున్నాడు. కొద్దిరోజులు ఇక్కడా, కొద్దిరోజులు అక్కడా ఇలా అటూ ఇటూ ఎడాపెడా పెళ్ళయాక కొద్దికొద్దిరోజులు గడిపి అతను భార్యతో అత్తవారింటికి వెళ్తున్న వేళ....

ట్రెయినులో కమల కొన్ని సార్లు బొళుక్కు బొళుక్కున కక్కుకుంది. విద్యాసాగర్ మొదట ఆందోళన చెందాడు. వొంట్లో బాగో లేదా కమలా అన్నాడతను. బాగానే ఉందండీ అందామె. అలా అన్నాక ఆమె మరికొన్నిసార్లు కక్కుకుంది. అతనిలోని ఆందోళన అనుమానం క్రిందికిమారింది. ఆ రాత్రి అత్తవారింటికి వెళ్ళి ఏకాంతంగా గదిలో ఉన్నపుడు కొంపదీసి గర్భం దాల్చావా కమలా అన్నాడతను. ఉలిక్కిపడిందామె. ఆ వెంటనే సర్దుకుంది. అవును తమరి ప్రతాపమే అంది. ఈసారి ఉలిక్కిపడటం అతని వంతయింది. కాని మనం కలుసుకోవటం ప్రారంభించి వారం రోజులన్నా కాలేదుగదా అన్నాడతను. తమరంత శక్తివంతులు గావును అందామె. వ్యంగ్యంగా వినిపించాయా మాటలతనికి. అనుమానం రూఢి అయింది. పెళ్ళికి ముందే నీకెవరితోనో సంబంధం ఉంది అన్నాడు. ఛీ ఛీ మీరెంత అనుమానస్తులు అందామె. ఇంత చదువుకునీ సంస్కారం లేకపోతే ఎలాగ అంది. సిగ్గుండాలి ఇలాంటి మాటలనటానికి అంది. అప్పటికతను ఊరుకున్నాడు. కొన్నాళ్ళ తర్వాత అతనికి రూఢిగా తెలిసిపోయింది తన భార్య కడుపుతోందని పెళ్ళికి ముందే ఎవడితోనే పడుకోవటం వల్ల ఆ గర్భం వచ్చిందనీను. మళ్ళీ కదిపాడామెను. ఛీ ఛీ సిగ్గులేని మాటలు మాట్లాడటానికి మీకు సిగ్గులేకపోతే నాకన్నా ఉండాలి అందామె గొంతును పెంచి అధికారికంగా. బిత్తరపోయాడతను. దొంగని నువ్వే దొంగవని అనటానికి కూడా వీలులేని రోజులివి. ఎవడినోరు పెద్దదయితే ఎవడు అడ్డగోలుగా వాదించ గలిగితే వాడివి రోజులివాళ. నోరులేనివాడూ నీతినియమాల్ని పట్టుకు వేళ్ళాడుతున్నవాడూ కేవలం రీజన్ని మట్టుకే పట్టుకు ప్రాకులాడే వాడికి కాలం కాదివాళ. కోర్టుల్లో అసమంజస తీర్పుల్నీ, న్యాయవాదుల అడ్డగోలు వాదనల్నీ వినీవినీ చూసీ చూసీ ప్రజలు వాటిని తమ జీవితాలలో ప్రవేశపెట్టుకొంటున్నారు. సచ్ఛీలురకీ సజావు మనస్తత్వాలకీ సాత్వికతత్వాలకీ నోరులేని గోవులకీ ఈ లోకం ఒక నరకం. పిచ్చిముండాకొడుకుల్లారా మీరు కూడా వక్రమార్గాలకి మళ్ళండిరా నాయనా అన్యాయంగా ఎందుకు బలవుతారుగాని! పిచ్చి సన్నాసి మోహనదాసు కరంచంద్ గాంధీ–నువ్వేమన్నావు? ఈ చెంప కొడితే ఆ చెంప కూడా చూపించమనా?? ఓరి వెర్రిముండా వాడా ఈ రోజున కనక నువ్విలా చేస్తే నీ రెండో చెంపనే కాక నీ పక్కనే వున్న పెళ్ళాం పిల్లల రెండు రెండు చెంపల్ని కూడా ఇదే సందని వాయించి వదుల్తారీ దుష్ట దుర్మార్గ కుటిలవర్తనులు!

తన పెళ్ళాం పెళ్ళికి ముందే కడుపు దాల్చింది. అందుకు రుజువు స్పష్టంగా తెలిసిపోతోంది. అదేమిటని అడిగితే ఆమె అడ్డగోలుగా నీకు బుద్ధి లేదా ఇలాంటి మాటలనటానికి అంటోంది. డాక్టరు దగ్గరకు వెళ్దాం పద నీకెన్నో నెలో పరీక్ష చేయించుదాం అన్నాడతను. మళ్ళీ అదే మాట, ఏ పాపమూ ఎగరని దాన్ని నేను డాక్టరు వద్దకు ఎందుకు రావాలి అందామె. నీది అన్నం తినే నోరా పెంట తింటున్న నోరా అన్నాడతను సహనం కోల్పోయి. ఆమె బేరుమని ఏడ్చింది. చెంపల వెంట కన్నీళ్ళు ధారాపాతంగా వర్షించాయి. వెక్కి వెక్కి ఏడ్చింది. చూసే వాళ్ళకు జాలివేసేట్టుందా ఏడుపు. అతడి మీద కోపం తెప్పించేట్టు వుందా ఏడుపు. అవును సార్ ఏడవడం చాతనవటం ముఖ్యంగాని ఆ ఏడుపు వెనక కారణం సహేతుకమా, దుర్హేతుకమా ఎవడికి కావాలి? కైక ఏడుపుకి శ్రీరామ చంద్రుడు ఎన్నాళ్ళు ఇబ్బందులననుభవించలేదు!? చిత్రాంగి ఏడుపుకు సారంగధరుడు బలికాలేదా?

ఇక భార్యతో లాభం లేదని అతను తన మామ వద్ద ఆ ప్రస్తావనను తీసుకు వచ్చాడు. మొదట ఆయన రుద్రుడయి పోయాడు. నా వంశం ఎలాంటిదో తెలుసా అన్నాడు. తెలుస్తానే వుంది అన్నాడు విద్యాసాగర్. ఇలా ఒక రాత్రల్లా తీవ్ర వాదోపవాదాలు

# 'సిటీలైట్స్'

జరిగాయి మామా అల్లుళ్ళ మధ్య. మామ ఆఖరుకు తన కూతురు చేసిన నిర్వాకం ఒప్పుకోవాల్సి వచ్చింది. వెంటనే ఆయన అల్లుడి చేతులు పట్టుకున్నాడు. బాబూ మమ్మల్ని క్షమించు ఇంకెప్పుడూ అలాంటి తప్పుడు పనులు అది చేయదని నేను హామీ ఇస్తున్నాను మా పరువు బజారున పడవేయవద్దు అన్నాడతను. విద్యాసాగర్ అప్పటికి బాగా మొండితనంలోకి వచ్చేశాడు. మీ అమ్మాయిని ఏలుకోను విడాకులిచ్చేస్తాను అన్నాడు. ఆయన....అంత పెద్ద మనిషీ ఈ సారి అల్లుడి కాళ్ళు పట్టుకున్నాడు. బాబ్బాబూ నాకింకో కూతురుంది, నువ్విలా చేస్తే దానికి పెళ్ళికాదు అన్నాడు.

కాకపోతే నాకేమిటి అన్నాడు అల్లుడు. అప్పటికి ఆ గదిలో ఇంట్లోని అందరూ ముసురుకుని వున్నారు. విద్యాసాగర్ భార్య, కమల, మరదలు విమల, అత్త, బావమరుదులు ఇద్దరూ కూడా. నాయనా కనీసం మా రెండో అమ్మాయి పెళ్ళయే దాకానన్నా విడాకులివ్వకు బాబూ అంది అతని అత్త. ససేమిరా అన్నాడు విద్యాసాగర్. ఈ సారి అతని బావమరుదులిద్దరూ కల్పించుకున్నారు. వాళ్ళకీ ఇతనికీ మాటా మాటా పెరిగింది. పెద్ద బావమరిది ఇతడిని ఒక చెంపదెబ్బ కొట్టాడు. ఇతను తిరిగి ఈడ్చి మరోదెబ్బ కొట్టాలు.

ఆ రకంగా అనుకోకుండా ఉద్రేకాలు పెరిగిపోయి అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. రెండో బావమరిది వచ్చి విద్యాసాగర్ జుట్టు పట్టుకున్నాడు. ఇదే సమయమనుకుని కమల వచ్చి మొగుడి చెంపలు ఎడాపెడా వాయించింది. ఈడ్చి ఆమె డొక్కలో తన్నాడు విద్యాసాగర్ ఒరేయ్ లాభంలేదు ఇక కమ్ముకోండిరా అన్నాడు అతని మామ. అప్పుడు అక్కడొక పద్మవ్యూహం తయారయింది. అభిమన్యుడయాడు విద్యాసాగర్, మిగతావాళ్ళంతా ఒకటి అతనొక్కడూ ఒకటి. అతణ్ణి

దొక్కల్లో పొడిచారు. మర్మావయవాల్లో కుమ్మారు. వీపు మీద గుద్దారు. అతను డిఫెన్సు చేసుకోవటానికి కూడా అవకాశం లేకపోయింది. అతణ్ణి కింద పడవేసారు వాళ్ళు. ఒకళ్ళు కాళ్ళు కదలకుండా పట్టుకున్నారు. మరొకళ్ళు చేతుల్ని కాళ్ళకింద వేసి నొక్కిపట్టారు. ఒసేయ్ త్వరగా దిండు పట్రండే అంటూ కేక వేసాడతని మామ. వణుకుతున్న కాళ్ళతో ఉరుకులూ పరుగులతో వెళ్ళి కమల ఫోమ్ దిండును పట్టుకువచ్చింది. ఒరేయ్ వీణ్ణి అలాగే కదలకుండా పట్టుకోండిరా అన్నాడు మామ తన ఇద్దరు కొడుకులతో. అని, వాళ్ళలా చేసాక దిండుని అల్లుడి మొహం మీద ఉంచి తనా దిండుమీద తీరిగ్గా కూర్చున్నాడాయన. ఊపిరందక కొద్ది క్షణాలపాటు విద్యాసాగర్ దేహం గిల గిలా కొట్టుకోవటానికి ప్రయత్నించింది. అంతే ఆ తర్వాత అతని దేహంలో చలనం ఆగిపోయింది. ఆ మర్నాడు అతని దేహం హుస్సేన్ సాగర్‌లో తేలుతూ కనిపించింది జనానికి....

* * *

కేసు కోర్టుకు వెళ్ళింది. విద్యాసాగర్ మామ వాళ్ళు అల్లుడి మరణాన్ని ఆత్మహత్యగా చిత్రించటానికి ప్రయత్నించారు. పోలీసుల చుట్టూ తిరిగారు. తమ అల్లుడు నపుంసకుడనీ ఆ అవమానాన్ని భరించలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడనీనూ. అందుకు అవసరమైన సాక్షాల్ని సృష్టించారు తమ డబ్బు ద్వారా.

సామాన్యంగా ఇలాంటి కేసుల్లో కోర్టులు మనం నమ్మ శక్యం కాని విచిత్ర తీర్పుల్ని వెలువరిస్తుంటాయి. అలాంటి తీర్పుల్ని వింటున్నప్పుడు మనకు న్యాయవ్యవస్థమీద నమ్మకం సడలిపోతుంటుంది. అదృష్టమేమిటంటే ఈ కేసులో మాత్రం జడ్జిగారు నేరస్తుల్ని పసిగట్టి హంతుడి మామకీ, బావమరుదులకిద్దరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధించాడు. ఈమాత్రం జడ్జిమెంట్స్ అప్పుడప్పుడూ వస్తుండబట్టే ఈ దేశంలో సామాన్య జనం ఇంకా బతికి బట్టగట్టగలుగుతున్నారనిపిస్తుంటుంది. కాదంటారా సార్ ! !

ఈ మధ్య పత్రికలలో వెలువడ్డ ఒక కోర్టు తీర్పు చదివాక—

—రచయిత

# మిత్రలాభం



## ఎలా వుంటావు ఫ్రెండ్?

నేను ఆంధ్రా యూనివర్సిటీలో చదివే రోజుల్లో, రేడియోలో కలం స్నేహితుల శీర్షికలో నా పేరు ఎనౌన్స్ చేశారు. హాస్టల్ అడ్రస్‌కి చాలా లెటర్స్ వచ్చాయి. కొంతమంది తొందర్లోనే మానేశారనుకోండి. కాకినాడనుంచీ....జ అనే ఫ్రెండ్ మాత్రం చాలా రోజులు లెటర్స్‌రాసేది. అప్పట్లో తను బి. ఏ. చదువుతుండేది.

చక్కటి దస్తూరీ, అంతకంటే చక్కటి పదాల పొందికా....ప్రతి ఉత్తరమూ ఓ సర్టిఫికెట్‌లా వుండేవి. ఎన్నో భావాలు పరస్పరం తెలియచేసుకున్నాకా, నా ఫోటో గురించి అడిగిందామె. ముందు నా ఫోటో పంపిస్తే, తర్వాత తన ఫోటో పంపిస్తానని వాగ్దానం చేసింది. నా ఫోటోలు రెండు, మూడు పంపించినా తన ఫోటో మాత్రం పంపించలేదు, ప్రతిసారి ఏదో కారణం చెప్తుండేది. నెమ్మది నెమ్మదిగా ఉత్తరాలు వ్రాయడం కూడా తగ్గించేసింది. ఐతే అలాంటి దశలోనే మా క్లాస్‌మేట్ మరో అతనికి లెటర్స్ రాస్తోందని తెలిసింది. వాడిని 'ఎడ్రస్ ఎక్కడిదిరా?' అని అడిగితే నా రూంలోంచే ఓ సారి తీసుకెళ్ళానని చెప్పాడు. ఓ సారి తనకు రాసిన ఉత్తరాలన్నీ చూపించాడు. సేమ్....నాకు వ్రాసినట్లే వున్నాయవన్నీ! అవే వాక్యాలు, అవే కొటేషన్లూ, అవే వాగ్దానాలూ....! ఆమె డబుల్ గేమ్ నచ్చక లెటర్స్ పూర్తిగా మానేశాను. అయితే కాలక్రమేణా తెల్సింది, ఇలాంటి ఫ్రెండ్స్ ఎందరో వుండేవాళ్ళట ఆవిడకి.

తెనాలి నుంచీ మరో ఫ్రెండ్ "అరే....ఆవిడా, నాకూ లెటర్స్ రాసేదే గదా-" అంటూ. పాపం అనుకుని ఆమె గురించి జాలి పడ్డాను. ఐతే "మీరు జీవించి వున్నంత కాలం మిమ్మల్ని మరచిపోలేను. నా వూపిరి వున్నంత కాలం మీకు గ్రీటింగ్స్ పంపిస్తా ప్రతిసంవత్సరం తొలిరోజునా-" ఇలా ఎన్నెన్నో తీపి వాక్యాలు! మేడమ్....అలా అందరికీ వ్రాయడంలో మీ వుద్దేశ్యమేమిటో నాకు తెలియలేదు. బహుశా మీకది సరదాగా కాలక్షేపం ఐ వుండొచ్చు కానీ, స్నేహాన్ని ఆటగా భావించకూడదండీ! స్నేహంలో సిన్సియారిటీ ముఖ్యం: చదువుతున్నారు గదూ? నాకు తెల్సు మీరు ప్రతివారం ఖచ్చితంగా 'పల్లకి' చదువుతుంటారు? ష్యూర్.?). మీరు ప్రస్తుతం ఇదే వూళ్ళో వున్నారని తెలుసు. మీ యిల్లు కూడా తెలుసు. మిమ్మల్ని చూడాలనుకుంటే ఏ క్షణాన్నైనా రాగలను. కానీ రాలేదు, రాను కూడా. ఎందుకంటే మనసులో ఒకటి, పైకి మరొకటి చెప్పేవాళ్ళంటే నా కస్సలు యిష్టముండదు! అంచేత ఎప్పటికీ మీరు కన్పించరు! సరదాగా 'పల్లకి'లో ఈ శీర్షిక చూసి మీకోసారి గుర్తు చేద్దామని వ్రాస్తున్నా....మీ ఇంట్లో సన్నజాజి పూలు పూస్తున్నాయా? "నీలిమేఘమా - జాలి చూపుమా - ఒక్క నిమిష మాగుమా...." గుర్తుందా పాట?

—ఓ స్నేహితుడు
అదేవూరు

"స్వచ్ఛమైన స్నేహం
వెల కట్టలేనిది
కల్మషం లేని చిరునవ్వు
ప్లాటినం కంటే విలువైనది."